# యాదాద్రిలో భక్తుల సందడి

## కిటకిటలాడిన వ్రత మండపం

యాదగిరిగుట్ట, నవంబర్ 26 : యాదగిరీశుడి దివ్యక్షేత్రం ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం సెలవుదినం కావడంతో స్వయంభూ నారసింహుడి దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూ కాంప్లెక్స్, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలో భక్తులతో కిక్కిరిసింది. కొండకింద కల్యాణకట్ట తలనీలాలు సమర్పించి, లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ధర్మదర్శానికి 5 గంటలు, వీఐపీ దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు సువర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల నిత్యతిరుకల్యాణోత్సవం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి నిజాభిషేకం, తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన ఆళ్వారులకు కొలుస్తూ హోమం జరిపారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్టలో ఆర్జిత పూజలు కొనసాగాయి. కొండకింద వ్రత మండపంలో 1,202 మంది దంపతులు పాల్గొన్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారిని సుమారు 45 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.62,94,674 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు.


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


ఆలయ మాఢవీధుల్లో కిటకిటలాడుతున్న భక్తులు

## పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

**• కేంద్ర ఎన్నికల పరిశీలకులు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 26 : పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల పరిశీలకులు సిబ్బందికి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజుకు 72 గంటల ముందు చేపట్టాల్సిన విధులపై జనరల్ అబ్జర్వర్ సీఎన్ మహేశ్వరన్, పోలీస్ అబ్జర్వర్ విపుల్ కుమార్, ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ రాకేశ్ కుమార్ నోడల్ బృందాలకు ఆదివారం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలైన్స్, వీడియో వీవింగ్ బృందాలు నిరంతర హోటళ్లు, విశ్రాంతి గృహాలు, బస్, రైల్వే స్టేషన్ల వాటిలో తనిఖీలు నిర్వహించాలని, ఇతర ప్రాంతాల వ్యక్తులు కనబడితే నియోజకవర్గం నుంచి బయటకు పంపాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో బందోబస్తు పకడ్బందీగా అమలు చేయాలని, సెక్టార్ ఆఫీసర్లు పోలింగ్ ప్రక్రియను క్షణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే జెండగే మాట్లాడుతూ ఓటరు ఎడ్యుకేషన్, ఈవీఎం యంత్రాల మేనేజ్‌మెంట్, పోలింగ్ మెటీరియల్ తరలింపు ఏర్పాట్లు, టీములు, చెకోపోస్టుల పనితీరు, కలెక్టరేట్‌లో వెబ్ కాస్టింగ్ నిర్వహణ, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, వసతుల గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ పోలీసు కమిషనర్ రాజేశ్ చంద్ర, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, భువనగిరి రిటర్నింగ్ అధికారి అమరేందర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## భువనగిరిలో బీజేపీ సభ ఫ్లాప్

(మొదటి పేజీతరువాయి)

హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంతటి పెద్దమనిషి వచ్చిన సభ జనం లేక తుస్సుమంది. సుమారు పది ఎకరాల్లో సభ నిర్వహించగా, పావు వంతు కూడా జనం నిండ లేదు. కేవలం కుర్చీలు వేసిన వైపు మాత్రమే జనం కనిపించారు. అమిత్ షా మాట్లాడుతున్న సమయంలో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. షా ప్రసంగ సమయంలోనే కొంత జనం ఇంటిబాట పట్టారు. ఎవరూ వెళ్లిపోవద్దని బీజేపీ నేతలు బలవంతంగా కూర్చోబెట్టే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ జనం సభ ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. సభ మొత్తంలో ఆరు నుంచి ఏడు వేల మంది కూడా ఉండరని అంచనా. ఈ సభకు ఆలేరు, భువనగిరి నియోజకవర్గం నుంచి జనాన్ని తరలించడం విశేషం. అంటే రెండు నియోజకవర్గాలు కలిపి ఒకచోటే సభ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ జన సందోహం లేదు. ఇక సభలో ఎలాంటి జోష్ కనిపించలేదు. నేతల ప్రసంగాల సమయంలో జనం కిమ్మనకుండా ఉండడంతో నాయకులు చప్పట్లు కొట్టాలని పదేపదే బతిలాడిన స్పందన రాలేదు. మరోవైపు అమిత్ షా చాపర్‌లో వచ్చిన సందర్భంలో స్వాగతం పలుకడానికి బీజేపీ అభ్యర్థి లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్‌కే టీఎమ్మార్పీఎస్ మద్దతు


జమీలాపేట్‌లో బీఆర్ఎస్ మద్దతు తెలుపుతున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

బీబీనగర్, నవంబర్ 25 : బీఆర్ఎస్‌కే టీఎమ్మార్పీఎస్ మద్దతు ఉంటుందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు చిలకమర్రి గణేశ్ తెలిపారు. ఆదివారం మండలంలోని జమీలాపేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేసి యాజమాన్య హక్కులు కల్పిస్తానన్న బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల శంకర్, ఓట్ల యాదగిరి, సుర్పంగి సుగుణ, చిలువేరు జంగమ్మ పాల్గొన్నారు.

## నేడు ఆత్మకూరు(ఎం)లో గౌడన్నల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు(ఎం), నవంబర్ 26 : మండల కేంద్రంలోని పీఎస్ గార్డెన్లో సోమవారం గుండాల, ఆత్మకూరు(ఎం), మోటకొండూర్ మండలాల గౌడన్నల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు గౌడ సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గౌడ్‌లంతా భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ విప్ సునీత గెలుపులో భాగస్వాములు కావాలి

**• బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ**


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

మోటకొండూర్, నవంబర్ 26 : బీఆర్ఎస్ ఆలేరు అభ్యర్థి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గెలుపులో మహిళలంతా భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఆర్ఎస్ మహిళలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్వై నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, గ్రామశాఖ అధ్యక్షుడు బొట్ల మహేశ్, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

## సీఎం కేసీఆర్‌తోనే కురుమలకు న్యాయం

**• బీఆర్ఎస్ యువజన విభాగం సెక్రటరీ జనరల్ సంతోష్**

ఆలేరు రూరల్, నవంబర్ 26 : సీఎం కేసీఆర్‌తోనే కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని బీఆర్ఎస్ యువజన విభాగం సెక్రటరీ జనరల్ పరిదె సంతోష్ అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో తొమ్మిదేండ్లలో కురుమలు రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య కురుమ అని చెప్పుకుంటూ... మాసాయిపేటలో కురుమ గుట్టను మింగి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కురుమ కులస్తులందరూ మళ్లీ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో కరెకె మల్లేశం, కరికె మల్లేశ్, కర్రె బాబు, బండ రాజాబాబు, మేకల శ్రీనివాస్ పాల్గొన్నారు.


యాదగిరిగుట్ట: మాసాయిపేటలో ఓటు అభ్యర్థిస్తున్న పాల సంఘం చైర్మన్ వంటేరు ఇంద్రసేనారెడ్డి


రాజాపేట : దూదివెంకటాపురంలో ప్రచారంలో పాల్గొన్న జడ్పీటీసీ గోపాల్‌గౌడ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కుమార్తె హర్షితారెడ్డి



ఆలేరు రూరల్ : కందిగడ్డతండాలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మండల కార్యదర్శి జైరాంనాయక్

## ఊపందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

యాదగిరిగుట్ట, నవంబర్ 26 : బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు ప్రచారం ఊపందుకున్నది. ఆదివారం ఆలేరు నియోజకవర్గవ్యాప్తంగా 8 మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని ఓటర్లకు వివరిస్తూ గొంగిడి సునీత గెలుపు కోసం ప్రచారం చేశారు.


ఆత్మకూరు(ఎం)లో సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తుర్కపల్లి : కొండాపురంలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు


మోటకొండూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు


యాదగిరిగుట్ట పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


రాజాపేట : బసంతాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మహేంద్ర యువసేన మండలాధ్యక్షుడు రాజు